

అర్జీదారులకు బాసటగా నిలవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

స్పందన అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు బాసటగా నిలవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 172 వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఅర్జీని క్షుణ్ణంగా చదివి కాలయాపన లేకుండా పరిష్కరించాలన్నారు. పూర్తి పరిష్కారం చూపినప్పుడే అర్జీదారుని మన్ననలను పొందగలుగుతామన్నారు. ఒకే సమస్యపై పలుమార్లు స్పందనకు రావడం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదన్నారు. అర్జీదారుని స్థానంలో మనం ఉంటే ఏ విధంగా సమస్యకు పరిష్కారం కోరుకుంటామో అదేవిధంగా వారు కూడా కోరుకుంటారనేది ఆలోచన చేయాన్నారు. ఈ కార్యక్రమంలో జెసి కలెక్టర్ జెవి.మురళీ, డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఎస్‌పి బి.శ్రీకాంత్, డిపిఒ ఎం.నాగలత, జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

కలెక్టరేట్ వద్ద కదంతొక్కిన అంగన్‌వాడీలు

జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన కార్యకర్తలు, ఆయాలు

శాసనమండలిలో నిలదీస్తాం : ఎంఎల్‌సి సాబ్జీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పోరాటాలతోనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారమవుతాయని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, బకాయిలు విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని తదితర డిమాండ్లతో అంగన్వాడీ కార్యకర్తలు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.జాన్సీ అధ్యక్షతన పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుండి ఆటోలు, బస్సుల్లో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఉదయం తొమ్మిది గంటలకే పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అంగన్‌వాడీలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రాజెక్టు కేంద్రాలు, మండల ఆఫీసుల వద్ద ఆందోళన చేపట్టి అక్కడ నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. నవరత్నాలు, ఓట్లు తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్వాడీల సమస్యలు పట్టడం లేదని వారు తీవ్రంగా విమర్శించారు. శిశు మరణాలు, బాలింత మరణాల రేటును తగ్గించి పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నట్లు ప్రభుత్వ రికార్డులే తెలియజేస్తున్నాయని, కానీ అంగన్వాడీల సమస్యలు మాత్రం



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



మాట్లాడుతున్న ఎంఎల్‌సి సాబ్జీ

పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు సంఘీభావం తెలిపిన సాబ్జీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం స్పందించాలన్నారు. అంగన్వాడీల పట్ల సిఎం జగన్ వైఖరి ఏమిటో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలపై వచ్చే శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అమరావతిలో జరిగే ధర్నాకు ఎంఎల్‌సిలు అంతా మద్దతు తెలుపుతున్నామన్నారు. చలో ఢిల్లీ, చలో అమరావతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ప్రభుత్వం నాశిరకం సెల్ ఫోన్లు ఇచ్చి అంగన్వాడీలపై పని ఒత్తిడి పెంచారన్నారు. రకరకాల యాప్‌లతో వారిని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రశాంతంగా కుటుంబ సభ్యులతో గడపడానికి కూడా సమయం లేకుండా మానసికవేదనతో అంగన్వాడీలు కుంగిపోతున్నారన్నారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు పెరిగి అంగన్వాడీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కిందిస్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను కూడా పరిష్కరించలేని స్థితిలో అధికారులున్నారన్నారు.

సిఐటియు జిల్లా నాయకులు వాసుదేవరావు, పి.వి.ప్రతాప్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలకు అంగన్వాడీల సమస్యలు వినడానికి కూడా సిద్ధంగా లేకపోవడం దారుణమన్నారు. ఐద్వా సంఘం జిల్లా నాయకులు ఎ.అజయ్‌కుమారి, వికలాంగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు అంగన్వాడీల ఆందోళనకు మద్దతు తెలిపారు. వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేయాలని, దానికి అన్ని సంఘాల మద్దతు ఉంటుందన్నారు. అనంతరం డిఆర్‌ఒ కృష్ణకుమారికి, పీడీ సుధారాణికి వినతిపత్రం అందజేశారు. దీనిపై పీడీ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తామని, ఈ నెలాఖరులోపు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని, ప్రమోషన్ల విషయంలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దెలు, విద్యుత్ బిల్లుల బకాయిలు తక్షణం చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు అల్లూరి అరుణ్, ఇంజేటి శ్రీనివాస్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు లారెన్స్ కుమారి, అంగన్వాడీ లీడర్స్ తులసి, మహాలక్ష్మి, శ్యామలా రాణి, ఉషారాణి, మార్తమ్మ, స్వర్ణలత, అంగన్‌వాడీలు, హెల్పర్లు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



డిఆర్‌ఒ కృష్ణకుమారికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ఆక్వా సర్వేలో సాగు భూములనూ గుర్తించాలి

భీమవరం : ఆక్వా జోన్ సర్వేలో ఆక్వా సాగు భూములతో పాటు, సాగుకు అనుకూలమైన భూములను కూడా గుర్తించి నివేదికలో పొందుపరచాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఫిష్‌ఆంధ్ర పథకంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. రూ.లక్ష నుండి రూ.3.50 లక్షల విలువ కలిగిన 82 మినీ రిటైల్ అవుట్‌లెట్లు, రిటైల్ వెండింగ్ ఫుడ్ కోర్టులు, మొబైల్ యూనిట్లకు ఈ నెల పదో తేదీలోపు స్త్రీ నిధి, డిసిసిబి, మెప్మా ద్వారా రుణాల మంజూరును పూర్తి చేయాలన్నారు. పాలకొల్లు, భీమవరం, నరసాపురం, పాలకోడేరులో ఏర్పాటు చేయనున్న ఒక్కొక్కటి రూ.10 లక్షలు విలువ కలిగిన ఐదు ఫిష్ హబ్ యూనిట్లకు బ్యాంకు లింకేజీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ఆందోళన

ఉండి: విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల సంఘం జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పిల్లి సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా విఆర్‌ఎలకు రూ.21వేల జీతం అందిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేయాలన్నారు. చాలీచాలని జీతాలతోనే వారి కుటుంబాలు కష్టంగా గడుతుపుతున్నారన్నారు. అనంతరం వినతిపత్రాన్ని సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహశీల్దార్ మోరంపూడి మహేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎలు ముత్యాలపల్లి గణేష్, వై.ప్రసాద్, బాషా, ఎం.రాజగోపాలం పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ఆందోళన


ప్రజాశక్తి - అత్తిలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ విఆర్‌ఎలకు వర్తింపజేయాలని విఆర్‌ఎల సంఘం భీమవరం డివిజన్ అధ్యక్షుడు, వరిఘేడు విఆర్‌ఎ బైపే వెంకట అరవ విజ్ఞాని పండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజ్ఞాని పండు మాట్లాడుతూ విఆర్‌ఎలకు ఇచ్చిన డిఎ రికవరీ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలన్నారు. డిఎతో కూడిన వేతనం ఇవ్వాలని కోరారు. అర్హులందరికీ ప్రమోషన్



తహశీల్దార్ రామాంజనేయులుకు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

కల్పించాలన్నారు. తమ సమస్యలపై సిసిఎల్‌ఎ అధికారులు రాష్ట్ర కమిటీతో చర్చలు జరపాలన్నారు. మండలంలో 36 మంది విధులు నిర్వహిస్తుండగా, 22 మంది సీనియర్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ నిర్వహించే రిజిస్ట్రేషన్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తున్నారన్నారు. పెద్ద వయసు ఉన్న వారు ఫేస్ యాప్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫేస్ యాప్‌ను మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు లంకపల్లి శ్రీకాంత్, వైస్ ప్రెసిడెంట్ రాపాక యేసు రత్నం, కార్యదర్శి టి.జాన్‌మోషే, కోశాధికారి కె.లక్ష్మి, విఆర్‌ఎలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

సంక్షేమ పథకాల అమలు ఘనత వైసిపిదే

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రజలందరికీ మునుపెన్నడూ లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రాబోయే రోజుల్లో ప్రజలు దీవించాలని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సోమవారం చించినాడలో వైసిపి శ్రేణులతో కలిసి ఆయన గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలను వివరించారు. ఆయన వెంట మండలస్థాయి నాయకులతో పాటు గ్రామ సర్పంచి దంగేటి రాజమణి, నాయకులు ముదునూరి లక్ష్మీపతి రాజు, ముదునూరి రంగరాజు, సామంత పూడి రాధాకృష్ణంరాజు, వడ్డీ రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

వేండ్ర ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి విద్యార్థుల తల్లిదండ్రులు స్పందనలో వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో సుమారు 150 మందికి పైగా విద్యార్థులు ఉన్నప్పటికీ కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా తమ చిన్నారులంతా చదువులో వెనకబడుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత సమస్యను తీర్చాలని వినతిలో పేర్కొన్నారు.



వేండ్ర ఎంపిపి మెయిన్ పాఠశాల ఇదే

పగిలిన డ్యాం తలుపులు

సాగునీరు వృథాగా పోతోందని రైతుల ఆవేదన

ప్రజాశక్తి - వీరవాసరం

సాగుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఇరిగేషన్ అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోడంతో వీరవాసరం పశ్చిమ కాలువా సాగునీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. వీరవాసరం వద్ద కాలువపై రెండో డ్యాం తలుపు శిథిలావస్థకు చేరుకోవడంతో కొద్ది రోజుల క్రితం పగిలిపోయిందని, దీంతో సాగునీరు వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కొద్ది రోజుల క్రితం పగిలిన డ్యాం తలుపులు తొలగించారు. ప్రస్తుతం దాళ్వా సాగుకు సంబంధించి వంతుల వారీ విధానం అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్యామ్‌కు కొత్త తలుపులు అమర్చడంలో ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీంతో



వీరవాసరంలో తొలగించిన డ్యాం తలుపులు

డ్యాం తలుపులు మూయకపోతే డ్యాం ఎగువ, దిగువ ప్రాంతాల ఆయకట్టుకు సాగునీరు మళ్లింపులో అసమానతలు ఏర్పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఎఇని వివరణ కోరగా డ్యాం తలుపులు పగిలిపోవడంతో వాటిని తొలగించామన్నారు. కొత్త తలుపులకు అంచనాలు వేసి నివేదిక అందించామని తెలిపారు. అనుమతులు వచ్చేలోగా కొంత మంది రైతులు ముందుకు రావడంతో వారి ముందస్తు ఆర్థిక సహకారంతో కొత్త తలుపులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

లబ్ధిదారులను బెదిరించడం దుర్మార్గం

సిపిఎం

ప్రజాశక్తి - భీమవరం

'ఎంతో ఆర్భాటంగా పంపిణీ చేసిన జగనన్న ఇళ్ల స్థలాలు లాక్కుంటామంటున్నారు.. పూర్తయిన టిడ్కో ఇళ్లను పంపిణీ చేయడం లేదు.. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో సామాన్య, నిరుపేదల సొంతింటి కల నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. ఇదెక్కడి అన్యాయం' అని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా విమర్శించింది. డిసెంబర్ నాటికి జగనన్న ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తిచేయాలని, లేకుంటే స్థలాలు స్వాధీనం చేసుకుంటామని గృహ నిర్మాణ శాఖ అధికారులు బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గృహనిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారులను బెదిరించడమంటే రాష్ట్ర ప్రభుత్వం బెదిరిస్తున్నట్లుగానే సిపిఎం భావిస్తోందన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి స్థలాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందన్నారు. కానీ ఇంటి నిర్మాణ వ్యయం దాదాపు రూ.ఐదు లక్షల నుంచి రూ.ఆరు లక్షల వరకూ అవుతోందన్నారు. కానీ ప్రభుత్వం రూ.1.80 లక్షలు మాత్రమే చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చే నగదుతో ఇంటి నిర్మాణం ఎంతమాత్రమూ పూర్తికాదన్నారు. పేదల ప్రభుత్వమని, అందరికీ ఇల్లు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం సెంటు భూమిని ఇచ్చి, స్థలాలు పూడ్చకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా లబ్ధిదారులను ఇబ్బంది పెడుతోందన్నారు. ఇళ్ల నిర్మాణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోకుండా, ఆ నెపాన్ని ప్రజలపై నెట్టి స్థలాలు లాక్కుంటామని బెదిరించడం దారుణమన్నారు. ఒక వైపున ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, వైద్య ఖర్చులు పెరిగిన సమయంలో మరోవైపున నేటికీ అద్దె ఇళ్లలో ఉంటూ అద్దెల భారాన్ని మోయలేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇన్ని ఇబ్బందుల మధ్య లక్షల రూపాయలు వెచ్చించి ఇల్లు నిర్మించుకోవడం అంటే సామాన్యులకు సాధ్యమయ్యే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలన్నారు. మరోవైపు నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందన్నారు. లబ్ధిదారులు అప్పులు తెచ్చి డిపాజిట్లు కట్టి, మరో వైపు అద్దెలు కడుతూ నష్టపోతున్నారన్నారు. ఒకవైపు ఇల్లు నిర్మించుకోకపోతే స్థలాలు లాక్కుంటాం, మరోవైపున పూర్తయిన టిడ్కో ఇళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతోందన్నారు. దీనివల్ల సామాన్య ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఈ విధమైన విధానాన్ని వీడాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు లాక్కునేందుకు ప్రభుత్వం, అధికారులు పూనుకుంటే లబ్ధిదారులను ఏకం చేసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఇంటి రుణం రూ.ఐదు లక్షలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఉండి

జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.ఐదు లక్షల రుణం అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఉండి మెయిన్ సెంటర్‌లోని సిపిఎం కార్యాలయంలో కిల్లారి తవిటి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా జెఎన్‌వి.గోపాలన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు అందించిందని ఆ లే అవుట్‌లలో ఇప్పటివరకూ పూడిక పనులు చాలాచోట్ల జరగలేదని, జరిగినచోట లబ్ధిదారులను ఇంటి నిర్మాణం చేపట్టకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారన్నారు. పూడిక జరిగిన చోట్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణ సామాగ్రి తీసుకువెళ్లడానికి సరైన రహదారి మార్గం లేకుండా పోయిందన్నారు. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో లబ్ధిదారుల్లో చాలామంది ఇల్లు నిర్మించుకోవడానికి ముందుకు రాలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరవల్లి మాధవరావు, చీర్ల శేషు, మాదాసి గోపి, నిమ్మితి కిషోర్, కింతాడ రమేష్, వీరవల్లి త్రిమూర్తులు పాల్గొన్నారు.

రీ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రీ సర్వే పనులు త్వరగా పూర్తిచేసి మంచి ఫలితాలు సాధించాలని జెసి జెవి.మురళీ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జెసి రెవెన్యూ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూ - సర్వే , హౌస్ సైట్స్, భూ హక్కు పత్రాలు, డేత్ కేసులు, బరియల్ గ్రౌండ్స్, జాతీయ రహదారులు, గోదాములు నిర్మాణాలు, తదితర 15 అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే అన్ని గ్రామాల్లో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. రీ సర్వేలో భాగంగా ప్రతి అంగుళం ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేయాలని ఆదేశించారు. ప్రతీ రైతుకు సంబంధించిన జిరాయితీ భూమిని పక్కాగా సర్వే నిర్వహించి రికార్డులు తయారు చేయాలన్నారు.

రైతులు రీ సర్వే టీముకు సహకరించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, జిల్లా కో ఆపరేటివ్ అధికారి రవికుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.మురళీ కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను జిల్లాలోనే సర్దుబాటు చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

సుదూర ప్రాంతాలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేసిన ఉపాధ్యాయులను భీమవరం జిల్లాలో సర్దుబాటు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి కోరారు. కలెక్టరేట్లో జిల్లా విద్యాశాఖ అధికారి రమణకు సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడారు. పని సర్దుబాటుపై ఏలురు జిల్లాకు సర్దుబాటు చేసిన వారిని పశ్చిమ గోదావరి జిల్లాలో సర్దుబాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వివిధ సబ్జెక్టు ఉపాధ్యాయులను పని సర్దు బాటు సందర్భంలో కొంతమందిని పశ్చిమ ఉపాధ్యయులను ఏలూరు జిల్లాలో సర్దుబాటు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో 70 కిలోమీటర్ల నుంచి 120 కిలోమీటర్ల వరకూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సుదూరం ప్రయాణం చేసిన వారు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని వారి వారి డివిజన్, మండలాల పరిధిలో సర్దుబాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు, యుటిఎఫ్ నేత పట్టాభి రామయ్య ఉన్నారు.



జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

టిడిపి కంచుకోటలో పాగా వేస్తాం : పివిఎల్

ప్రజాశక్తి - ఉండి


వచ్చే ఎన్నికల్లో టిడిపి కంచుకోట అయిన ఉండి నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరవేయడం ఖాయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, నియోజకవర్గ పరిశీలకులు రౌతు సూర్యప్రకాష్ రావు తెలిపారు. సోమవారం ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి శిక్షణా శిబిరంలో ముఖ్య అతిథులుగా పివిఎల్ నరసింహరాజు, నియోజకవర్గ పరిశీలకులు, రాజమండ్రి మాజీ శాసనసభ్యులు రౌతు సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో వైసిపిలో ఉన్న వర్గ పోరు వల్ల నియోజకవర్గంలో టిడిపి విజయం సాధిస్తూ వచ్చిందని, నేడు నియోజకవర్గంలోని వైసిపి నాయకులందరూ ఏకతాటిపైకి వచ్చి నియోజకవర్గంలో వైసిపికి విజయ దుందుభి మోగించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టిడిపి పొత్తుల కోసం ఆరాటపడుతోందని, వైసిపి ఒంటరి గానే ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ కొప్రపాటి అనిత పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ ఇవ్వాలి

ఎంఎల్‌ఎ గ్రంథి శ్రీనివాస్‌కు రైతుల వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆక్వా జోన్, నాన్ జోన్‌ల పేరుతో ఆక్వా రైతుల విద్యుత్ సర్వీసులను విభజించి విద్యుత్ రాయితీ లేకుండా చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని వీరవాసరం మండలానికి చెందిన ఆక్వా రైతులు సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమను ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆక్వా, వరి రైతులకు పూర్తిగా అండగా ఉన్నారన్నారు. కరోనా సమయంలో కూడా ఆక్వా రైతులను ఆదుకున్న ప్రభుత్వం తమదేనని గుర్తు చేశారు. విద్యుత్ రాయితీ విషయంలో ఆక్వా రైతులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆక్వా సంఘం రైతులు భోగిరెడ్డి శ్రీనివాస్, పంజా మాణిక్యాలరావు, గూడూరి ఓంకార్, పంజా వెంకటేశ్వరరావు, నాగబాబు, మల్లా తులసీరావు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆక్వా రైతులు

మొగల్తూరులో దాహం కేకలు!

శివారు గ్రామాలకు అందని తాగునీరు - ప్రజల అవస్థలు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు ఉన్నా శివారు గ్రామాల ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు. మొగల్తూరు, కెపిపాలెం నార్త్, కోమటితిప్ప గ్రామాల్లో రక్షితనీట పథకాలు ఉన్నాయి. వీటి నిర్వహణకు ఏటా రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. అయినా ప్రజలకు తాగునీటి సమస్యలు తప్పడం లేదు.


ముత్యాలపల్లిలో గుంతలో నీరు పట్టుకుంటున్న మహిళలు

వేసవికి ముందే..

మండలంలోని గ్రామాలన్నీ తాగునీటి కాలువలకు శివారున ఉన్నాయి. గ్రామాలచుట్టూ ఉప్పుటేరులు ఉన్నాయి. దీంతో తాగునీటి కోసం ప్రజలు కుళాయిల ద్వారా సరఫరా చేసే నీటిపైనే ఆధారపడుతున్నారు. సాధారణంగా వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుంటారు. ఈ ఏడాది దానికి భిన్నంగా శీతాకాలంలో తాగునీటి కోసం ప్రజలు పాట్లు పడుతున్నారు.

మరమ్మతుల్లో ఫిల్టర్ బెడ్లు..

మొగల్తూరు రక్షితనీటి పథకంలో ఆర్ ఎఫ్ఎస్ ఫిల్టర్లు ఉన్నాయి. నిర్వహణ లోపం, గతంలో పైపులైన్లు ఏర్పాటుచేసిన సమయంలో ముందుచూపు లోపించడంతో ప్రజలకు శుద్ధిజలాలు పూర్తిస్థాయిలో సరఫరా జరగడం లేదు. శేరేపాలెం, మొగల్తూరులోని కొండావారిపాలెం, గోడావారిపాలెం, నాగదేవతకాలనీ తదితర చోట్ల నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. కెపిపాలెం, కోమటితిప్పలోని తాగునీటి పథకాల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్లు మరమ్మతులకు గురయ్యాయి. వాటిలోని ఇసుక అడుగంటింది. దీంతో నీరు శుద్ధిచేయకుండానే ప్రజలకు సరఫరా చేస్తున్నారు.

నిర్వహణ లోపం..

తాగునీటి పథకాల్లో నిర్వహణ లోపం చోటుచేసుకుంటోంది. పలువురు పైపులకు విద్యుత్తు మోటార్లను ఏర్పాటు చేసి శుద్ధి జలాలను తాగునీటేతర అవసరాలకు తరలిస్తున్నారు. దీంతో శివారు ప్రాంత వాసులకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. తక్షణం అధికారులు, పాలకులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

డ్రోన్ వినియోగంతో పెట్టుబడి ఆదా : ఎఒ

ప్రజాశక్తి - పెనుమంట్ర

వరికి డ్రోన్‌తో రసాయనాలు పిచికారీ చేయడం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందని ఎఒ మద్దాల జయదుర్గా మాధురి అన్నారు. సోమరాజు ఇల్లింద్రపర్రులో రైతు సత్తి సురేష్‌రెడ్డి 20 ఎకరాల వరి పంటకు తొలిసారిగా కాండంతొలుచు పురుగు (బిఎల్‌బి) వ్యాపించడంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం డ్రోన్‌తో రసాయనాలు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ జిల్లాలో తొలిసారిగా డ్రోన్ సహాయంతో రసాయనాన్ని పిచికారీ చేసినట్లు తెలిపారు. ఈ డ్రోన్ 20 లీటర్ల బరువు సామర్థ్యం ఉంటున్నాయి. వీటివల్ల రైతు పెట్టుబడి ఖర్చు చాలా వరకూ తగ్గుతుందన్నారు. రైతు సత్తి సురేష్ రెడ్డి మాట్లాడుతూ డ్రోన్‌తో పిచికారీ చేయడం వల్ల సమయం, పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సత్యనారాయణ, డ్రోన్ ఆపరేటర్ బి.హేమలత, వివిఎ సీతారాం, రైతులు పాల్గొన్నారు.

వాణీ జయరామ్‌కు నివాళి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

సాహితీ మేటి గాయని వాణీ జయరామ్ సంతాప సభ సోమవారం స్థానిక కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవనంలో శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వాణీ జయరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు ఆంధ్ర నాటక పరిషత్ కార్యదర్శి ఆరేటి ప్రకాష్ మాట్లాడుతూ సుమారు 10 వేలకుపైగా పాటలు పాడి తన గానామృతంతో అలరించారని తెలిపారు. ఆమె మరణం తీరని లోటని అన్నారు. త్యాగరాజ భక్త సభ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పద్మభూషణ్ అవార్డు తీసుకోకుండానే మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో దాసరి మల్లికార్జునరావు (చిన్ని), కొండ్రు శ్రీనివాస్, కారుమూరి చినబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, మామిళ్ళ రాజు పాల్గొన్నారు.

సర్పంచి భర్త క్రిష్టాఫర్ మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

భట్లమగుటూరు సర్పంచి భయ్యే సుగుణ భర్త క్రిష్టాఫర్ (70) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన గ్రామ సర్పంచిగా మూడు సార్లు, ఉప సర్పంచిగా, పెనుమంట్ర సొసైటీ డైరెక్టర్‌గా, సాగునీటి సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. ఆదివారం రాత్రి ఇంటి వద్ద గుండెపోటు రాగా భీమవరం ఆస్పత్రికి తరలించారు. కొద్దిసేపటికి పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్, రైతు సంఘం నాయకులు ఆకుల హరే రామ్, సిపిఎం మండల కార్యదర్శి కూనసాని సుబ్బారావు, ఎంపిడిఒ వి.పూర్ణచక్రవర్తి, ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న, ఎన్‌ఆర్‌ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ బాపూజీ సంతాపం తెలిపారు.


పెనుమంట్ర: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ తెలిపారు. సోమవారం మార్టేరు సెంటర్లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణం మృత్యు ఒడిలోకి ద్వారాలంటివన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రయాణాలలో ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు.

పాలకోడేరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని భీమవరం రూరల్ సిఐ సిహెచ్.నాగప్రసాద్ సూచించారు. ఎస్ఐ యు.రవిప్రకాష్ ఆదేశాల మేరకు నెలరోజులుగా ప్రత్యేక హెల్మెట్ డ్రైవ్ చేపట్టామన్నారు. శృంగవృక్షం గ్రామంలో సోమవారం హెల్మెట్ ఆవశ్యకతను వివరిస్తూ ద్విచక్ర వాహన దారులచే హెల్మెట్లను కొనుగోలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.సూర్య రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

2008లో అప్పటి ప్రభుత్వం కోడేపల్లిదేడ దిబ్బలో మిగులు స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సిపిఎం డిమాండ్ చేసింది. సోమవారం తహశీల్దార్ ఎస్.గురుమూర్తి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకుడు మాదాసు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు లేఅవుట్ వేసే సమయంలో ఇంటి స్థలానికి తక్కువ వచ్చే చిన్న చిన్న ముక్కలుగా వదిలేశారని అన్నారు. కొంతకాలం వేయించే పని కూడా జరిగిపోయిందని తెలిపారు. ఆ స్థలాలను కోడేపల్లిడం దిబ్బ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించాలని డిమాండ్ చేశారు. స్థలాల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, నాగిరెడ్డి గంగారావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ముందస్తు చికిత్స ద్వారా కుష్టు నివారణ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

కుష్టు వ్యాధి గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పర్శ ప్రోగ్రాం డిపిఎంఒ డాక్టర్ సుధీర్ తెలిపారు. సోమవారం గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా ఫ్యామిలీ ఫిజీషియన్ సెంటర్లో ఎంఎల్‌హెచ్‌పిల సాయంతో చర్మ సంబంధ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కుష్టు వ్యాధిని ముందుగానే గుర్తించి తగిన చికిత్స తీసుకుని నివారించవచ్చని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పిలు ప్రసన్న, హన్సి, ఎఎన్ఎం సరళ, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు : 'స్పర్శ' పేరుతో కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలు బంగారువారి చెరువు అర్బన్ హస్పిటల్లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మీసాల చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కుష్టు రోగ నివారణకు కృషిచేయాలన్నారు. డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ జక్కంపూడి రామ ప్రసాద్ మాట్లాడారు. కొత్త కేసులు నమోదు అవుతున్నాయన్నారు. తొలి దశలోనే వ్యాధిని గుర్తించటం ద్వారా వికలాంగులుగా మారకుండా నివారించవచ్చన్నారు. క కార్యక్రమంలో ఎఎన్ఎం ఝాన్సీరత్నం, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవి బాధితులకు వ్యాక్సిన్

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎఆర్‌టి సెంటర్‌లో మందులు వాడుతున్న హెచ్ఐవి బాధితులందరూ హెపటైటీస్-బి వాక్సిన్ వేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.శివ ప్రసాద్ సూచించారు.


బాధితులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

జాతీయ వైరల్ హెపటైటీస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ఎఆర్‌టి సెంటర్‌లో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం నమోదుకాబడిన హెపటైటిస్-బి నెగిటివ్ వచ్చిన 20 మంది హెచ్ఐవి బాధితులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడారు. హెచ్ఐవి ప్రాణాంతమైన వ్యాధి అన్నారు. కార్యక్రమంలో ఎఆర్‌టి మెడికల్ ఆఫీసర్ సుంకవల్లి రామకృష్ణ, ఎఆర్‌టి సిబ్బంది షర్మిళ, సుధీర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

హైకోర్టులో జోగయ్య పిటీషన్

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం ఇడబ్ల్యూఎస్ కోటాలో కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ కాపు సంక్షేమ సేన రాష్ట్ర అధ్యక్షులు చేగొండి హరరామ జోగయ్య సోమవారం హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ వాజ్యం మంగళవారం విచారణకు వస్తుందని జోగయ్య విలేకరులకు తెలిపారు. కాపులకు ఎడిఎ బిలియర్స్‌లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు.

'ప్రజలకు అండగా జనసేన'

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజలకు అండగా జనసేన ఉంటుందని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం సాయంత్రం మొగల్తూరు పంచాయతీ కొండావారిపాలెం, కన్నాయిగూడెంలో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రెయినేజీ, రోడ్లు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. కొండవారిపాలెంలో వాలీబాల్ ఆడుతున్న యువతతో కలిసి ఆయన ఆడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొల్లాటి గోపి, దూది బాబు, బొక్కా చంటి, దాసరి కృష్ణాజీ, అందే కొండ పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు

పాలకొల్లులో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకొల్లు

జగన్ పాదయాత్ర సమయంలో సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకూ ఇస్తానని చెప్పి అధికారం చేపట్టాక కొందరికి మాత్రమే ఇవ్వడం పట్ల ప్రజలు అసహనంతో ఉన్నారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పట్టణంలోని 16వ వార్డులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు నమోదు చేసుకున్నారు. అభివృద్ధి కంటే ప్రతిపక్షాలను ఎలా అణిచివేయాలని మంత్రివర్గం ఆలోచిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, కర్నేన గౌరినాయుడు, పకీర్ బాబు పాల్గొన్నారు.

8న రోటరీ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

మొగల్తూరు : మొగల్తూరులోని అందే బాపన్న, కోట్ల వెంకట రంగారావు కళాశాలలో ఈ నెల 8న రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నామని క్లబ్ రీజనల్ రోటరీ ఫౌండేషన్ ఛైర్మన్ కోట్ల రామ కుమార్ సోమవారం తెలిపారు. వేమగిరిలోని పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యులు ఈ శిబిరంలో వైద్య సేవలందించనున్నారు. శిబిరానికి వచ్చే ప్రజలు ఆధార్ కార్డు రేషన్ కార్డులను వెంట తీసుకురావాలని ఆయన సూచించారు. శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు, మందులను అందిస్తామన్నారు. అవసరమైన వారికి శాస్త్ర చికిత్సలు కూడా చేయిస్తామన్నారు.

ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలి

కాళ్ల: ప్రభుత్వం ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కాళ్ల ప్రభుత్వాసుపత్రి ఆవరణలో ఆశా వర్కర్ల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఆశా వర్కర్ల అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వారికి ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్ల మండల అధ్యక్షురాలు రెడ్డి దేవి, కార్యదర్శి పెద్దిబోయిన కృష్ణవేణి, కోశాధికారి ఎన్.రేవతి పాల్గొన్నారు.

వైపిపి నేతల దౌర్జన్యానికి సిపిఎం ఖండన

ప్రజాశక్తి - యలమంచిలి

గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి నాయకుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నానని సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం చించినాడలో జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను సిపిఎం మండల కార్యదర్శి బాలరాజు ప్రశ్నిస్తున్న సమయంలో చించినాడ సొసైటీ ఛైర్మన్ సామంతపూడి రాధాకృష్ణంరాజు, విశ్రాంత మండల విద్యా శాఖాధికారి ముదునూరి రంగరాజు పాటు కొంత మంది వైసిపి నాయకులు కలుగజేసుకొని పరుష పదజాలంతో దూషిస్తూ విరుచుకుపడి దాడి చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, జెడ్‌పి ఛైర్మన్ సమక్షంలోనే దాడి చేయడానికి ప్రయత్నించారంటే దళితులంటే చులకన భావమని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

చికెన్ షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్ల, సీసలి, జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ టి.రాంబాబు ఆధ్వర్యంలో కాళ్లలో సినిమా హాల్ సెంటర్లోని చికెన్ దుకాణంలో కేజీకి సుమారు 100 గ్రాములు తేడా రావడంతో కేసు నమోదు చేశారు. సాధారణంగా తనిఖీల్లో భాగంగా స్టాంపులు లేని కాటాలకు స్టాంపులు వేశారు. తూనికలు, కొలతల విషయంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, వినియోగదారులను మోసం చేసే దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది అమ్మారావు, షేక్ బాజీ పాల్గొన్నారు.


దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుబ్బారావు మృతి

ప్రజాశక్తి - ఉండి

విశ్రాంత ఉపాధ్యాయుడు కడలి సుబ్బారావు (92) సోమవారం మృతి చెందారు. ఆయనకు కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అల్లూరి గాంధీ బాబురాజు, ఆకివీడు, ఉండి శాఖ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు సుబ్బారావు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బారావు మాస్టారు ఉత్తమ ఉపాధ్యాయుడు అని తెలిపారు. విద్యా బోధనలో మేటి అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో ఎన్ఆర్‌పి అగ్రహారం మాజీ సర్పంచి కౌరు కోటేశ్వరరావు ఉన్నారు.

చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి

టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే మహిళలు అభివృద్ధి చెందారని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఉండి, భీమవరం నియోజకవర్గాల మహిళా జాగృతి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.


మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి

మహిళలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. టిడిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో మహిళలకు దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లను ఇచ్చి డ్వాక్రా సంఘాల ద్వారా స్వయంగా వ్యాపార కుటీర పరిశ్రమలు నెలకొల్పి అభివృద్ధి చెందారని తెలిపారు. మహిళా జాగతి సభ్యురాలు బాపట్ల విజేత మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి టిడిపి పాటుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, డ్వాక్రా సంఘాల రాష్ట్ర ప్రధానకార్యదర్శి మెరగాని నారాయణమ్మ, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు కన్నెగంటి రూత్ కళ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సయ్యద్ నసీమ బేగం పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు గుర్తించేందుకు వైట్ మార్కింగ్ వేయాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లాలోని స్పీడ్ బ్రేకర్లను గుర్తించేందుకు వైట్ మార్కింగ్ వేయాలని శృంగవృక్షం గ్రామాభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి సోము రావకృష్ణ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. స్పీడ్ బ్రేకర్స్‌పై ఎలాంటి మార్కింగ్ లు లేకపోవడం వల్ల రోడ్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి జనసేన సాయం

ప్రజాశక్తి - తణుకు

ఇటీవల మృతి చెందిన కొమరవరం గ్రామానికి చెందిన ఘనసాల వరప్రసాద్ కుటుంబ సభ్యులను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు, నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా రామచంద్ర తన వంతు సాయంగా రూ.5000, ఎంపిటిసి సుబ్బారావు రూ.ఐదు వేలు, నాయకుడు రెల్లి పండు రూ.5000 కలిపి 15 వేల రూపాయలు ప్రసాద్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిక్కాల వేణు, పంతం నానాజీ, జవ్వాది ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు అరెస్టు

63.5 కాసుల బంగారం, 3 మోటార్ సైకిళ్లు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - పాలకొల్లు

జిల్లాలో వివిధ 21 చైన్ స్నాచింగ్ కేసుల్లో ముద్దాయిలైన ఇద్దరు యువకులను పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుంచి 3 మోటార్ సైకిళ్లు, 2 సెల్ ఫోన్లు 63.5 కాసుల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్ చెప్పారు. పాలకొల్లు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో గత ఏడాదిగా మహిళలను భయభ్రాంతులకు గురిచేసిన ఈ ఇరువురిని పట్టుకున్నందుకు పాలకొల్లు ఎస్ఐ బి.శ్రీనివాస్, ముత్యాలరావు, సిబ్బందిని అభినందించారు. వారికి త్వరలో రివార్డులు ఇస్తామని చెప్పారు. భీమవరం మండలం వెంపకు చెందిన దేవర నాగేశ్వరరావు, బొక్క నరేష్‌ను పక్కా సమాచారంతో సోమవారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఎస్పీ చెప్పారు. గత నెల 20న పాలకొల్లు మండలం వరిధనం రోడ్లో ఇద్దరు మహిళలు వాకింగ్ చేస్తుండగా వీరు మోటార్ సైకిల్‌పై వచ్చి వారి మెడలో బంగారు ఆభరణాలు తెంచి పారిపోయారు. సోమవారం పాలకొల్లు అయ్యప్ప గుడి వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న వీరిని ఆపి విచారించగా గత ఏడాదిగా 21 చైన్ స్నాచింగ్ కేసుల్లో బంగారం వస్తువులను తెంచినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి దొంగిలించినట్లు తెలిపారు. సమావేశంలో డిఎస్‌పి మనోహర్, సిఐ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి రవిప్రకాష్

25, 26 తేదీల్లో మహిళలకు శిక్షణ : ఐద్వా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాజకీయంగా మహిళలను చైతన్యపర్చేందుకు ఈ నెల 25, 26వ తేదీల్లో తాడేపల్లిగూడెంలో ఐద్వా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో స్త్రీల పట్ల జరిగే సాంఘిక దురాచారాలను ఎదుర్కొనేందుకు ఐద్వా ఎనలేని కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతికి గాను వారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసే ఐద్వాకు ఆర్థికంగా సహకరించాలని కోరారు.

జెసిఐ అధ్యక్షురాలిగా మౌని

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్లో జెసిఐ (జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్) నూతన కార్యవర్గం సమావేశం సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు ముచ్చర్ల సంజయ్ పాల్గొన్నారు. జెసిఐ సేవలు మరింత విస్తృతపర్చాలని తెలిపారు. అనంతరం జెసిఐ పాలకొల్లు రేసింగ్ అధ్యక్షురాలుగా డాక్టర్ కావలి మౌని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో జెసిఐ జోన్ ప్రెసిడెంట్ జిఎస్ఎన్ వర్మ, జెడ్ విపి ఏడుకొండలు, కీనోట్ స్పీకర్ మురళీమోహన్, ఫాస్ట్ జెడ్ విపి మీనా, మనీ దీప్తి రేపాక పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - ఆకివీడు

మాదకద్రవ్యాలే వినియోగించి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని పోలీసు, ఎక్సైజ్ అధికారులు విద్యార్థులకు సూచించారు. ఆకివీడు పోలీసులు, ఎన్ఫోర్స్మెంట్ ఎక్సైజ్ అధికారులు, కళాశాల సంయుక్తంగా దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరించారు. అలాగే కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎక్సైజ్ సిఐ డి.రామారావు, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.రాజారెడ్డి మాట్లాడారు. అనంతరం మాదకద్రవ్యాల వినియోగం నియంత్రణ కమిటీని ఏర్పాటు చేశారు. విద్యార్థులు కళాశాల అధ్యాపకులు ప్రిన్సిపల్ కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి ప్రకటించారు.